క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

22న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 22న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

వేడుకగా సీతారామచంద్ర స్వామి కల్యాణం



సీతారామచంద్రస్వామి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు



వీధి విక్రయదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సూరినాయుడు

మహారాణిపేట : కేజీహెచ్ అవుట్, ఇన్ గేట్ల వద్ద ఉన్న వీధి విక్రయదారుల వల్ల వాహనాలకు, ప్రయాణికులకు అంతరాయం కలగకుండా జాగ్రత్త తీసుకోవాలని ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూరినాయుడు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది కేజీహెచ్ దరి వీధి విక్రయదారులతో సమావేశం అయ్యారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అవరోధం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని అవగాహన కల్పించారు. బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ వీధి విక్రయదారుల తరఫున, పోలీసులతో చర్చలు జరిపారు.

మూడు స్కూల్ బస్సులపై కేసులు



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఎన్‌ఏడీ, మద్దిలపాలెం, బో యపాలెం, గాజువాక, షీలానగర్, బీచ్ రోడ్డు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏడు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి, బాలాజీరావు, హరి ప్రసాద్, మన్మోహన్, శ్రీనివాస్ యాదవ్, పి.శిరీష, సత్యంనాయుడు, సృజన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యమట..

- ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జగన్నాథ రథయాత్ర
- ఒడిశా సంప్రదాయరీతిలో వేడుకలు



రథంపై విశేష అలంకరణలో బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వామివారు



నేరెళ్లకోనేరు రోడ్డులో మహిళల కోలాటాలు, భజనలు

అల్లిపురం: జగన్నాథ రథయాత్ర మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. నేరెళ్లకోనేరు ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొని జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవిలకు విశేష పూజలు చేశారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూరీ క్షేత్రంలో నిర్వహించిన విధంగానే అల్లిపురం నేరెళ్లకోనేరులో కూడా రథయాత్ర గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నారన్నారు. అక్కడి సంప్రదాయాలను పాటిస్తూ ప్రతి ఏడాది రథయాత్ర చేపడుతున్నారన్నారు. అనంతరం ఒడిశా సంప్రదాయ రీతిలో భజనలు చేస్తూ నేరెళ్లకోనేరు నుంచి గోకుల్ థియేటర్, ఎస్‌ఆర్‌ఎంటీ, చలువతోట, సింహాలదేవిడి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు మీదుగా తిరిగి నేరెళ్లకోనేరుకు చేరుకుంది. అనంతరం స్వామి వారిని ఆలయంలో అధిష్ఠింపజేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తుల సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో ఆ ప్రాంతం సందడిగా మారింది.



ఒడిశా సంప్రదాయ దుస్తుల్లో రథాన్ని లాగుతున్న ఉత్కళ్ సమాజ్ ప్రతినిధులు

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

డాబాగార్డెన్స్: సిరిపురం (ద్రోణంరాజు సర్కిల్) కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్-3 పరిధి ద్రోణంరాజు సర్కిల్, బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రోణంరాజు కూడలిలో వ్యర్థాలతో తయారు చేసిన విభిన్న ఆకృతులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులు పర్యవేక్షించి, పనులు మందకొడిగా సాగుతున్నాయని, త్వరితగతిన పనులు చేపట్టి, ఈనెల చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డు కోస్టల్ బ్యాటరీ నుంచి అప్పుఘర్ వరకు ప్రధాన కాలువల్లోని వ్యర్థాలను తీసి రోడ్డుపై ఉంచేస్తున్నారని, ఫలితంగా విపరీతమైన దుర్వాసన వస్తుందని, తీసిన వ్యర్థాలను వెంటనే ఎత్తించాలని అధికారులను ఆదేశించారు. ఆర్కేబీచ్ నుంచి పామ్‌బీచ్ వరకు శాండ్‌బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. బీచ్‌లో వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, అవి ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్లాస్టిక్ ఇంకా కనిపిస్తుందని, ప్లాస్టిక్ నిర్మూలనకు ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంచి చర్యలు చేపట్టాలని, బీచ్‌రోడ్డులో రాత్రి పారిశుధ్య పనులు పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, వేణుగోపాల్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు తదితరులు పాల్గొన్నారు.



ద్రోణంరాజు సర్కిల్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్స్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వైవీ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ నియోజకవర్గ ప్రధాన సమస్యలను టీటీడీ చైర్మన్, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల ప్రాంతీయ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం వైవీని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

ప్రధాన సమస్యలివే..

- 30వ వార్డు పరిధి అంగటిదిబ్బలో నివసిస్తున్న సుమారు 500 కుటుంబాలకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- పోర్టు కాలుష్యం నివారించి ప్రజలను కాపాడాలని కోరారు.
- 38వ వార్డు పరిధి రీడింగ్ రూమ్/కనకమహాలక్ష్మి ఆలయ ప్రధాన ఆర్చి నుంచి బీచ్ రోడ్డు వరకు వయా ఘోషా ఆసుపత్రి.. 60 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు.
- 30వ వార్డు పరిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపం ఆర్చి నుంచి కోడిపంద్యాల వీధి వరకు వెళ్లే మార్గాన్ని విస్తరించాలని కోరారు.
- ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు డీజిల్ ఆయిల్ సబ్సిడీ మంజూరు చేయాలని కోరారు.
- హుద్‌హుద్‌లో నష్టపోయిన బోట్లకు నష్టపరిహారం మంజూరు అందజేయాలని.. ఇంకా పలు సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. అదే విధంగా



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు సమస్యల పరిష్కారం కోరుతూ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కూడా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

జగనన్న ఆణిముత్యాలతో మరింత ప్రోత్సాహం



విజేతలైన విద్యార్థులతో కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: జగనన్న ఆణిముత్యాలు ద్వారా విద్యార్థులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. మంగళవారం వార్డులో ఎంవీడీఎం పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాధిక్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యకు ముఖ్యమంత్రి జగనన్న ప్రాముఖ్యత కల్పిస్తున్నారన్నారు. అనంతరం పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యు. కల్పన, దాసరి జాన్, రత్నకుమారిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు గాను నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో కిక్కిరిసిన జంక్షన్లు

రథయాత్ర ఊరేగింపులతో రోడ్లన్నీ రద్దీ

డాబాగార్డెన్స్: ఎటు చూసినా రద్దీయే. విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలు మంగళవారం సాయంత్రం రద్దీగా కనిపించాయి. జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా దక్షిణ నియోజకవర్గంలోని అన్ని ప్రధాన కూడళ్లు ట్రాఫిక్‌తో నిండాయి. ఇస్కాన్ విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర నేపథ్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి డాబాగార్డెన్స్ మీదుగా జగదాంబ జంక్షన్.. అక్కడి నుంచి వాల్తేర్ అప్‌రోడ్డు మీదుగా గురజాడ కళాక్షేత్రం వరకు రథయాత్ర కొనసాగడంతో డాబాగార్డెన్స్, అంబేడ్కర్ కూడలి, జగదాంబ జంక్షన్లలో విపరీతమైన రద్దీ నెలకొంది. ఇదిలా ఉండగా టౌన్‌కొత్తరోడ్డు నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు జగన్నాథుని రథయాత్ర పెద్ద ఎత్తున నిర్వహించడంతో జగదాంబ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, టౌన్ కొత్తరోడ్డు మీదుగా పాతపోస్టాఫీస్ వెళ్లే వాహనాలను టర్నర్ చౌల్ట్రీ వద్ద నుంచి ట్రాఫిక్ మళ్లించారు.

ఒకేసారి రావడంతో..

ఇస్కాన్ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర జగదాంబ జంక్షన్‌కు చేరుకోవడం, అలాగే టౌన్ కొత్తరోడ్డు నుంచి టర్నర్ చౌల్ట్రీకి వచ్చే రథం కూడా అదే సమయంలో చౌల్ట్రీ వద్దకు చేరుకోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కేజీహెచ్ నుంచి లేపాక్షి జంక్షన్ వయా టర్నర్ చౌల్ట్రీ మీదుగా వెళ్లే వాహనాలు నిలిపివేయడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయలేక కొంత మేర వాహన చోదకులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.



కలెక్టర్ కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వైపు రోడ్డు ఇలా..

ముగిసిన సంగీత యూత్ ఫెస్టివల్



కీర్తనలు ఆలపిస్తున్న జయతి, మహతి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న సంగీత యూత్ ఫెస్టివల్ మంగళవారం ముగిసింది. ఆఖరి రోజు మంగళవారం నిర్వహించిన కచేరీలో గాత్ర కళాకారులు పెరవలి సోదరీమణులు జయతి, మహతిల వయోలిన్ అద్భుతంగా సాగింది. వీరికి మృదంగంపై సాయి కేశవ్, ఘటంపై కొంటిన్యలు సహకరించారు. అనంతరం కె.నాగ వైష్ణవి గాత్ర కచేరికి కె.గాయత్రి వయోలిన్ సహకారం, జి.చంటి మృదంగంపై సంగీత సహకారం అందించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్

ద్విచక్ర వాహనం, రక్షణ గోడ ధ్వంసం

మల్కాపురం: ఆర్టీసీ బస్ అదుపు తప్పి.. సేవా మార్గంలోని రక్షణ గోడను ఢీకొట్టింది. బస్‌లో ప్రయాణికులు లేకపోవడం, రక్షణ గోడ వద్ద జన సంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో నేవీ ఉద్యోగికి చెందిన బైక్ దెబ్బతింది. వివరాలివీ.. గాజువాక డిపోకు చెందిన 55కే బస్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొత్తవలస నుంచి సింధియా వైపు వస్తోంది. మార్గమధ్యలో షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ దగ్గరకు రాగానే బస్ ముందు చక్రానికి మధ్య గల హైడ్రోలిక్ బ్రేక్ పైపు డివైడర్‌కు రాసుకుంది. ఈ క్రమంలో డివైడర్‌లో పైపు చిక్కుకుపోవడంతో ఆందోళనకు గురైన డ్రైవర్ వేగాన్ని పెంచాడు. దీంతో బస్ అదుపు తప్పింది. గత్యంతరం లేని పరిస్థితిలో బస్ డ్రైవర్ కమర్షియల్ కాంప్లెక్స్ పక్కన గల షిప్‌యార్డ్ ఉద్యోగుల కాలనీ రక్షణ గోడను ఢీ కొట్టాడు. అక్కడకు సమీపంలో ఫుట్‌పాత్‌పై కొంత మంది పండ్లు, కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. బస్ తమ మీదకు వస్తుందేమోనని భయపడి.. వ్యాపారులు అక్కడ నుంచి తప్పు కున్నారు. కాగా.. ఓ నేవీ ఉద్యోగి కొబ్బరి బొండం తాగేందుకు తన వాహనాన్ని పండ్ల దుకాణం వద్ద నిలిపాడు. అతని వాహనాన్ని బస్ బలంగా ఢీకొనడంతో దెబ్బతింది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు అక్కడకు చేరుకుని.. ట్రాఫిక్‌కు అంతరా యం లేకుండా చర్యలు చేపట్టారు. పొక్లెయిన్ సాయంతో బస్‌ను బయటకు తీశారు. గాజువాక ఆర్టీసీ డిపో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.



షిప్‌యార్డ్ కాలనీ రక్షణ గోడను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందన



విశాఖ స్పోర్ట్స్: ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అభినందించారు. గౌతమబుద్ధ విశ్వవిద్యాలయంలో జూన్ 3వ తేదీతో ముగిసిన ఖేలోఇండియా విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 64 కేజీల వెయిట్ కాటగిరీలో ఎస్.పల్లవి స్వర్ణాన్ని సాధించింది. 87 కేజీల్లో టి.సత్యజ్యోతి రజతాన్ని సాధించగా... 45 కేజీల విభాగంలో బి.రాజేశ్వరి, 89 కేజీల వెయిట్‌లో ఎం.మణికంఠ కాంస్యాలు అందు కున్నారు. ఏయూ తరుపున పాల్గొన్న వీరందరినీ వీసీతో పాటు రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, హెడ్ ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

రాచపోలమాంబ ఉత్సవాలు ప్రారంభం

నెలరోజుల పాటు సంబరాలు

అల్లిపురం: భక్తుల కొంగుబంగారం, అల్లిపురం గ్రామస్తుల ఇలవేల్పు, 14 గ్రామాల ప్రజల కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు రాచపోలమాంబ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భూలోకమాత అమ్మవారి పండగతో వేడుకను ప్రారంభించారు. ఈ రోజు నుంచి నెల రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం కుమ్మరవీధిలో గల అమ్మవారి పెద్దింటి నుంచి అమ్మవారిని తప్పిటగుళ్లు, పులివేషాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని కుమ్మరవీధి నుంచి అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల అమ్మవారి సతకం పట్టు వరకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మార్కెట్‌రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ మీదుగా గోకుల్ థియేటర్ దరి రాచపోలమాంబ ప్రధాన ఆలయం వరకు అమ్మవారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విశేష అలంకరణలో భూలోకమాత అమ్మవారు



అమ్మవారి తిరువీధి ఉత్సవంలో భాగంగా కళాకారుల కోలాటం



విశేష అలంకరణలో అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల అమ్మవారి సతకం పట్టు



తిరువీధి ఉత్సవంలో పులి వేషధారుల సందడి

అరుదైన చికిత్సతో రోగి ప్రాణాలకు రక్షణ

మహారాణిపేట : కదల్లేని స్థితిలో ఉన్న 48 సంవత్సరాల వ్యక్తికి ఓమ్నీ ఆస్పత్రి వైద్యుల బృందం విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారని, ఇప్పుడు ఆ వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నారని ఆస్పత్రి న్యూరాలజిస్టు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రామ్‌నగర్‌లో ఉన్న ఓమ్నీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ రెస్పిరేటరీ థెరపిస్టుల ఆకుంఠిత దీక్ష, వైద్యుల బృందం అపారమైన బాధ్యత వల్ల ఆ వ్యక్తిని మృత్యువు నుంచి బయటికి తీసుకు రాగలిగామన్నారు. 70 రోజుల క్రితం కదల్లేని స్థితిలో ఆ వ్యక్తిని తీసుకు వచ్చారని, అతను గులియన్-బారే సిండ్రోమ్ అనే తీవ్రమైన వ్యాధికి గురయ్యాడని తెలిపారు. ఆ వ్యాధిగ్రస్తులు ఒంట్లో కళ్లు తప్ప మరే భాగము కదపలేరని తెలిపారు. అతను ఒడిశాకు చెందిన మాణిక్‌కేశ్వర్ ప్రసాద్ అన్నారు. అతను అప్పుడు కంటి సైగలు మాత్రమే చేయగలిగేవాడని వివరించారు. ప్రతి లక్ష మందిలో ఇద్దరికి ఇలాంటి వ్యాధి సోకుతుందన్నారు. ఆ సమయంలో డాక్టర్ సతీష్‌చంద్ర రోగికి విజయవంతంగా వైద్య సేవలు అందించారన్నారు. ఇప్పుడు రోగి ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడని వివరించారు. వైద్య బృందం పనితీరు అద్భుతంగా ఉందని ఆస్పత్రికి చెందిన డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ రాధాకృష్ణ వివరించారు. ఈ సమావేశంలో మాణిక్‌కేశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి

మహారాణిపేట : విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు బి. జగన్, అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి. శ్రీరాములు ఆధ్వర్యంలో 50 కార్లతో సుమారు 100 మంది సభ్యులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం వల్ల ట్రాఫిక్‌కు దాదాపు అరగంట పాటు అంతరాయం కలిగింది. దీంతో జగన్, శ్రీనివాసరావుతో పాటు మరో నలుగురిని అరెస్ట్ చేసి మహారాణిపేట పోలీసుస్టేషన్‌కి తరలించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఓలా, ఉబర్ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఎవరూ ఇక్కడ ఉండటం లేదని, డ్రైవర్లకు సమస్య వస్తే ఎవరితో చెప్పుకోవాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని తెలిపారు. ఇక్కడ తమ సమస్యలు పరిష్కరించే ప్రతినిధిని ఏర్పాటు చేయాలని, ఓలా, ఉబర్ రైడ్‌పై 20 శాతం కమీషన్ మాత్రమే తీసుకోవాలని కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ ప్రతినిధులు

108 అంబులెన్స్‌ల ఫిట్‌నెస్ పరిశీలన

మహారాణిపేట : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్‌లను అధికారులు మంగళవారం పరిశీలించారు. అంబులెన్స్ పనితీరు, డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ తదితర అంశాలను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించారు. సంఘటన స్థలానికి 15 నిమిషాల్లో చేరుకునేందుకు డ్రైవర్లకు సూచనలు అందజేసి, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, విశాఖపట్నం సిటీ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ విశ్వాంజలి ఎం.గైక్వాడ్

మురళీనగర్: యోగా సాధన ద్వారా ఆరోగ్య సమస్యలను సులువుగా అధిగమించవచ్చని విశాఖపట్నం, విజయవాడ రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ విశ్వాంజలి ఎం.గైక్వాడ్ అన్నారు. విశాఖపట్నం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఒత్తిడి నుంచి బయటపడి చురుగ్గా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ కేవీఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. వివిధ యోగాసనాల వల్ల కలిగే ఆరోగ్యపరమైన ప్రయోజనాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 'ట్రైన్ ద మైండ్ అండ్ ట్రైన్ ద బాడీ' అంశంపై ఆయన వివరించారు. నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్ అకాడమీ విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.